

# ఆ "రెండు పదాలు"!

ఆర్. రంగస్వామి గౌడ్

వర్షాకాలపు మిట్టమధ్యాహ్నం, కర్నూలు పట్టణంలోని 'మధువన్ బార్'లో, మారుమూల టేబుల్‌పైన చిందరవందరగా ఉన్న టేబిల్ క్లాత్ సవరిస్తూ, కుర్చీలో చతికిలబడ్డాను. నా స్వయంకృతాపరాధం వల్ల చేజారిపోయిన విలువైన 'టెండరు' గూర్చి తలపోస్తూ, దిగాలుగా నా మిత్రుని కోసం ఎదురుచూస్తున్నాను.

ఇంతలో బట్టతలపైని టోపీ సవరించుకుంటూ, ఈల వేసుకుంటూ వయసుకు మించిన ఉత్సాహంతో, తన మామూలు పాత కోటుతో ఆ వృద్ధుడు బార్‌లో ప్రవేశించి, నా వైపు రావడం చూశాను.

ఆ ప్రాంతంలోనే 'క్లినిక్' నడుపుతున్న మానసిక వైద్యుడుగా అతను నాకు తెలుసు. అతనికి దాదాపు ఎనభై ఏళ్లుంటాయి. తన 'క్లినిక్'లో చివరి రోగిని పరీక్షించి అప్పుడే వస్తున్నట్లున్నాడు. నా పక్కనే ఉన్న కుర్చీని లాక్కుని అందులో కూర్చున్నాడు. 'ఓల్డ్‌మాంకు' రమ్ము తీసుకువచ్చి బేరర్ టేబిల్‌పై ఉంచాడు. నేను ఆయన్ను చూడక ఏడెనిమిది మాసాలు కావస్తోంది. ఆయనలో ఎలాంటి మార్పులేదు. అదే మందహాసంతో అంతే హుషారుగా ఉన్నాడు.

నావైపు చూస్తూ "నీకేమి కష్టం వచ్చింది? ఎందుకు అలా దిగులుగా ఉన్నావు?" అన్నాడు.

తొలి చూపుతోనే నాలోని వ్యాకులతను పసికట్టిన అతనివైపు విస్మయంగా చూస్తూ, ఏమాత్రం దాచుకోకుండా నా సమస్యను వివరించాను. నా తప్పిదాలకు నేనెవరినీ నిందించలేదు. నా తప్పుడు నిర్ణయాలకు నన్ను నేనే దూషించుకున్నాను. ఇలా దాదాపు పదిహేను నిముషాలు నా




## హీరో గురించి...

"ఉత్తమ చిత్ర నిర్మాత రామానాయుడు గారి అబ్బాయిని అయినందుకు గర్విస్తాను" అన్నాడు వెంకటేష్. అమెరికాలో కష్టపడి ఎం.బి.ఏ. చదువుకున్న వెంకటేష్ అనుకోకుండా సినిమాల్లోకి వచ్చాడు.

"సినిమా అనేది ఒక వ్యాపారం. ఇందులో నిర్మాతకు లాభాలు రావడానికి కృషి చెయ్యాలి. అందుకే నేనువెరైటీ కోసం తంటాలు పడతాను. కాని నా భావాలు, నా ఆదర్శాలు నా పాత్రలో ఉండాలని కోరుకోను. హీరోల ముఖాలు చూసి ఓపెనింగ్స్ రావచ్చు. కానీ కేవలం హీరోల కోసం జనం రారు. ఏ చిత్రానికైనా మొదటి హీరో కథ! ఆ తర్వాతే మేము" అంటాడు వెంకటేష్.

ఇవాళ వెంకటేష్ అభిమానులు, అతని చిత్రం మొదటి రోజు చూసే ఎందరో మహిళామణులు అతన్ని గురించిచెప్పిన నిజాలివి!

సేకరణ : సుధ



"రాధా! పిల్లవాణ్ని దత్తత తీసుకుంటా నన్నావు కదా! వద్దు, బాలికను దత్తత తీసుకో!"

"ఎందుకు?"

"ఒక రోజు మనకు ఆడపిల్ల గౌను పార్క్‌లో దొరికింది కదా — అందుకని!"

చాగాపురం (గద్వాల్)

వైఫల్యాలకు కారణాలు చెబుతూంటే, అతను తాపీగా 'రమ్ము' సేవిస్తున్నాడు.

నా ప్రసంగం ముగిసేటప్పటికి, అతను ఖాళీ గ్లాసు టేబిల్‌పై పెడుతూ "ఇక్కడకు దగ్గరగా ఉన్న నా క్లినిక్‌కు పోదాంరా!" అన్నాడు.

"ఎందుకు? మీరేమైనా అక్కడ మరచిపోయి వచ్చారా!" అన్నాను.

"లేదు" అన్నట్లు నిదానంగా తల ఊపాడు.

"నీకు కొన్ని విషయాలు చెబుతాను. వాటికి నీ స్పందన ఎలా ఉంటుందో అక్కడ గమనించాలి అంతే!" అన్నాడు.

చినుకుల్లో తడుస్తూ, అతని గది చేరుకున్నాము. 'ఏర్ కండిషన్' చేసినందువల్ల, ఆ గదిలో ప్రవేశించగానే వెచ్చదనంతో ఎంతో 'రిలాక్స్' అయ్యాను. గదిలోని అలమారలో పుస్తకాలు క్రమపద్ధతిలో ఉన్నాయి. ఆ గది గోడ మధ్య 'సిగ్మండ్ ఫ్రాయిడ్' చిత్తరువు వేలాడుతూ, ఆ గదిలోకి వచ్చే రోగుల మానసికస్థితిని అంచనా వేస్తున్నట్లుంది. ఎదురుగా కిటికీలో 'సోనీ టేప్ రికార్డరు', ఆ పక్కనే 'క్యాసెట్ ఆల్బమ్' ఉన్నాయి.

ఆ ముసలాయన ఒక 'క్యాసెట్' బయటకులాగి 'టేప్ రికార్డర్'లో ఉంచి, 'ప్లే బటన్' నొక్కాడు. నా వైపు చూస్తూ, "ఇందులో నా వైద్య సలహా కోసం వచ్చిన ముగ్గురు మానసిక రోగుల సంవేదనలు ఉన్నాయి. ఆ వ్యక్తుల సమస్యలు వేరు, జీవన విధానాలు వేరు! అయితే ఆ ముగ్గురి సంభాషణల్లో పలుమార్లు ఏదో రూపంలో పునరావృతమైన 'ఆ రెండు పదాలను' నీవు గ్రహించి నాకు వివరించు?" అన్నాడు.

అంతలోనే నవ్వుతూ "ఆశ్చర్యపడవద్దు! అందుకు తగిన సాక్ష్యాలు నా వద్ద ఉన్నాయి."

రికార్డు అయిన ఆ మూడు గొంతుల్లోనూ మరచిపోలేని గతం మిగిల్చిన జ్ఞాపకాలు రగిల్చిన పరివేదనే నాకు సర్వసామాన్యంగా గోచరించింది.

మొదటగా మాట్లాడిన వ్యక్తి, ఏదో వ్యాపారం చేసి నష్టపోయినట్లున్నాడు. ముందు చూపు లేనందుకు, అందర్నీ అతిగా నమ్మినందుకు, తగినంత కృషి చేయనందుకు తనను తానే నిందించుకున్నాడు.

ఆ తర్వాత మాట్లాడిన స్త్రీ గొంతుకలో, విధవరాలైన తల్లికిచ్చిన మాట కోసం, ఆజన్మాంతమూ కన్యగా మిగిలిపోయి, చేజేతులా పోగొట్టుకున్న వైవాహిక బంధాలు, సాంసారిక జీవన మాధుర్యాలను తలుచుకొని వాపోవడం ధ్వనించింది..

ఇక మూడవ గొంతు ఒక తల్లిది. పోలీసుల చేతుల్లో చిక్కిన తన కొడుకును తలచుకుంటూ, పదే పదే కష్టాలపాలైన తనయుని పట్ల జాలి, స్వీయనింద, ఆ గొంతులో స్ఫురించింది.

టేప్ రికార్డర్ ఆఫ్ చేసి, కుర్చీలో వెనక్కువాలి, నా వైపు చూస్తూ, "వారి సంభాషణల్లో పలుమార్లు విషతుల్యమైన 'అవే రెండు పదాలు' చోటు చేసుకున్నాయి. గమనించావా? నీవు కూడా ఇందాక బార్‌లో ఆ రెండు పదాలనే ప్రయోగించావు. గుర్తుకు తెచ్చుకో!" అన్నాడు.

నేను ఆశ్చర్యం నుండి కోలుకోక మునుపే, క్యాసెట్స్ భద్రపరచిన పెట్టెను నా వైపు తోస్తూ, ఆ "ఆ లేబుల్‌పై ఉన్న ఆ 'రెండు పదాలే', ఏ భాషలోనైనా సరే అత్యంత విషాదకరమైన పదాలు!" అన్నాడు.

నా కళ్లను దించి, ఎర్రని సిరాతో కొట్టొచ్చినట్లు కనబడే 'అలా జరిగుంటే' అనే పదాలను ఆసక్తితో గమనించాను. ఆ వృద్ధుడు ఇంకా ఇలా చెప్పుకుపోతున్నాడు. "నీవు ఆశ్చర్యపడతావు! ఎన్నో వేల సార్లు నేను ఈ కుర్చీలో కూర్చుని నిస్సారమైన 'అలా జరిగుంటే' అనే పదాలతో ప్రారంభించే వాక్యాలను విన్నాను. వాళ్లందరూ ఇలా అంటారు. 'నేను మరోలా చేశాను లేదా అలా చేయలేకపోయాను. నా కోపాన్ని అణుచుకుని ఉంటే, తెలివిగా ప్రవర్తించి ఉంటే, నాకు ఈ చిక్కులు వచ్చి ఉండేవి కావు. మీ వద్దకు వచ్చే సమస్య ఉత్పన్నమయ్యేది కాదు. 'అలా జరిగుంటే' అంటూ, నేను ఆపమనేంతవరకు వాపోతూనే ఉంటారు. ఒక్కోసారి నీకు వినిపించిన టేపులనే వినిపించి, 'అలా జరిగుంటే' అనే పదాలకు చోటివ్వకుంటే, మరో మార్గం దొరికి ఉండేది అని నేను వాళ్లతో అంటాను."

కాళ్లు బారజాపి, విస్మయంగా చూస్తున్న నాతో ఆ వృద్ధుడు ఇంకా ఇలా చెప్పుకుపోతున్నాడు. "అలా జరిగుంటే!... అనుకోవడంలో, ఆశించిన కార్యంలో ఏ మార్పూ జరగదు. పదే పదే ఆ పదాలను ఉచ్చరించడం వల్ల, మనిషి తిరోగమనం వైపు దృష్టి సారిస్తున్నాడు. ప్రయత్నం మానుకుని అచేతనావస్థలోకి జారుకుంటున్నాడు. ఆ పదాలకు అలవాటుపడటం వల్ల, జీవిత గమనంలో పరాజయమే తప్ప, విజయావకాశాలు శూన్యం. ఉదాహరణకు నీ విషయమే తీసుకో. నీ పరాజయానికి కారణమేమిటి? నీ తప్పుడు అంచనాలు, తొందరపాటు నిర్ణయాలు. ప్రతి మనిషీ జీవితంలో తప్పులు చేస్తూనే ఉంటాడు. అయితే ఆ తప్పులనే అనుభవాలుగా మలచుకుని విజయసాధన కోసం ప్రయత్నించడం మానవ ధర్మం.

"నీవు నాకు సమస్య చెప్పేటప్పుడు, జరిగినదానికి చింతించడం, 'అలా జరిగుంటే బాగుండేది' అనే పశ్చాత్తాపం తప్ప, నీ తప్పిదాలగురించి నీవు నేర్చుకున్నదేమీ లేదు."

"మీ కెలా తెలుసు?" అన్నాను, నిదానంగా

నన్ను నేనే సమాధానపరచుకుంటూ.

"ఎందుకంటే!" చెప్పుకుపోతున్నాడు ఆ వృద్ధుడు ప్రశాంత గంభీర వదనంతో —

"గతం నుండి నీవు బయటపడలేదు. భవిష్యత్తును గూర్చి ఒక్కమాటయినా చెప్పలేదు. నిజం చెప్పాలంటే గతాన్ని తలచుకునే నీలో నిర్వేదం చోటుచేసుకుంది. గతాన్ని పదే పదే తలచుకుని దుఃఖించడంలో ఓ వింత అనుభవాన్ని మానవుడు చవిచూస్తున్నాడు. దీనికి స్వస్తి పలకాలి" అన్నాడు.

"సరే. అలా అయితే దీనికి విరుగుడు ఏమిటి?" తల విదిలించుకుంటూ అన్నాను.

"దృష్టి మార్పు!" అన్నాడు ముదుసలి వెంటనే — "దీనికంతా మూలకారమైన ఆ రెండు పదాలను మార్చి వాటి స్థానంలో మరో రెండు పదాలను చేర్చు! అందువల్ల నీవు దిగజారడానికి బదులు, పైకి ఎగబ్రాకే అవకాశం కలుగుతుంది."

"అలాంటి పదాలు మీరు సూచిస్తారా?" అడిగాను ఆతురతతో.

"తప్పకుండా! 'అలా జరిగుంటే' అనే పదాలను కొట్టిపారవేయ్. 'మళ్లీ ఒకసారి' అనే శక్తివంతమైన పదాలను చేర్చు" అన్నాడు.

"మళ్లీ ఒకసారా!"

"అవును. ఆ పదాలు ఈ గదిలో ఎన్నో విచిత్రాలు సృష్టించాయి. 'అలా జరిగుంటే' అనే పదాలు రోగి నాతో వాడుతున్నంత వరకూ అతను కష్టాల్లో ఉన్నట్లే. ఆ రోగి నా కళ్లలోకి చూస్తూ, 'మళ్లీ ఒకసారి' ప్రయత్నిస్తాను అన్నప్పుడు తన సమస్యకు పరిష్కారం వెదుక్కున్నాడనిపిస్తుంది. ఎలాగంటే గతంలోని తన అనుభవాన్నుంచి నేర్చుకున్న పాఠాన్ని, భవిష్యత్తుకు వినియోగించ దలచుకొన్నాడన్నమాట! అంటే, పశ్చాత్తాపమనే తెరను తొలగించి, ప్రయత్నమనే దీపాంకురాన్ని వెలిగించి, చీకట్లు కమ్మిన భావి జీవితంలో ముందడుగు వేస్తున్నాడన్నమాట. నీవు కూడా అలాగే ప్రయత్నించు. నీకే తెలుస్తుంది."

ఆ ముసలాయన మాట్లాడటం మానివేశాడు. బయట వాన చినుకులు కిటికీ అద్దాలతో దోబూచులాడుతున్నాయి. జడత్వాన్ని ప్రసాదించే ఆ రెండు పదాలను తొలగించి, ఆ స్థానంలో వినూత్న చైతన్యం కలిగించే ఈ కొత్త పదాలను నా మస్తిష్కంలో ప్రవేశపెట్టాను.

"చివరగా ఒక్కమాట" అన్నాడు ఆ వృద్ధుడు.

"ఈ కిటుకు భవిష్యత్తులో నీవు సాధించాలనుకుంటున్న పనుల విషయంలో ప్రయోగించు."

వెనుకవైపున్న అలమారలో నుండి డైరీలాంటి ఓ పుస్తకాన్ని బయటకులాగి "ఈ పుస్తకంలో ఓ పంతులమ్మ ఆత్మకథ ఉంది.




ముందుతరానికి చెందిన ఆమె అనుభవాలు, ఆలోచనలు, జ్ఞాపకాలు ఇందులో ఉన్నాయి. ఆమె ఆ రోజుల్లో మా గ్రామంలో సెకండరీ టీచర్‌గా పనిచేస్తూ ఉండేది. ఆమె భర్త అసమర్థుడు. అవివేకి. ఏ పనీపాటా లేకుండా వీధుల్లో తిరిగేవాడు. సంసార బాధ్యతలు ఏవీ పట్టించుకునేవాడు కాదు. అందువల్ల పిల్లల పెంపకంలోనూ, వాళ్లకు విద్యాబుద్ధులు నేర్పించడంలోనూ తానే పూర్తి బాధ్యతను వహించి సంసారాన్ని నెట్టుకుంటూ పోయేది. ఈ పుస్తకంలోని అనేక పేజీల్లో ఆ పరంధామయ్య చేతకానితనం, ఆయన బలహీనతలు, తప్పిదాలు, ఆమె నిర్లక్ష్యాలు చోటుచేసుకున్నాయి. పరంధామయ్య చనిపోవడంతో ఆయన ప్రసక్తి తర్వాత పేజీల్లో రాలేదు. కొన్నేళ్లు గడిచాక, ఎన్నో పేజీల తరువాత, పరంధామయ్యగూర్చి ఆమె ఇలా రాసుకుంది — 'ఈ రోజు నేను జిల్లా విద్యాశాఖాధికారిణిగా ప్రమోట్ చేయబడ్డాను. ఈ పదవి చేపడుతున్నందుకు నా కెంతో గర్వంగా, ఆనందంగా ఉంది. అయితే నా ఆనందంలో పాలుపంచుకునేందుకు ఆయన లేడు. ఆ నక్షత్రాల వెనక ఎక్కడో దాగి ఉన్నాడు. అక్కడకు వెళ్లేదారి తెలిస్తే ఈ రాత్రికే నేను ఒంటరిగా అక్కడకు చేరుకుంటాను."

పుస్తకాన్ని మూసివేస్తూ, ఆ ముసలాయన "చూశావా! 'అలా జరిగుంటే' అని కొన్నేళ్ల తరువాత ఆమె అనుకుంటూ ఉంది. అతడు బ్రతికున్న రోజుల్లో ఆయనతో సమాధానపడి ఉంటే... పరంధామయ్య తప్పుల్ని, బలహీనతల్ని మన్నించి, ఆయన్ని ప్రేమించి ఉంటే అని పశ్చాత్తాప పడుతోంది. అప్పుడే అతన్ని మార్చేందుకు 'మళ్లీ ఒకసారి' ప్రయత్నించి ఉంటే, ఇన్నేళ్ల తరువాత తిరిగిరాని ఆ వ్యక్తిని పొందలేని ఆ అనుభూతుల్ని తలచుకుని 'అలా జరిగుంటే' అని క్రుంగిపోవలసిన అవసరం ఉండేది కాదు. ఎప్పుడో జార్చుకున్న జీవన కుసుమాన్ని పోగులు వీడిన దారంతో మళ్లీ బంధించాలనుకోవడం అవివేకం. అత్యంత ప్రధానమైన వ్యక్తిగత విషయాలలో సరియైన నిర్ణయాలు సకాలంలో తీసుకోకుండా, ఏదో నెపంతో కాల నిర్ణయానికి వదిలేస్తే మానవునికి చివరకు మిగిలేది పశ్చాత్తాపం మాత్రమే!"

పుస్తకాన్ని తిరిగి అలమారలో భద్రపరచి, కుర్చీలోంచి లేచి నిటారుగా నిలుచున్నాడు.

"ఇక చాలు! ఇంతటితో ఈ పాఠం ముగిస్తున్నా. నాకో సాయం చేయ్. ఓ టాక్సీని పిలు. నేను ఇంటికి వెళ్లాలి" అన్నాడు.

మేము ఇద్దరమూ ఆ భవంతి నుండి, చినుకులు పడుతున్న వీధిలోకి అడుగుపెట్టాము. వేగంగా వస్తున్న టాక్సీని గమనించి, ఆ వైపు పరుగెత్తాను. అయితే మరో ఆగంతకుడు నా కంటే ముందుగా పరుగెత్తి ఆ కారులో వెళ్లిపోయాడు.

"అరెరే!" అన్నాడు ఆ వృద్ధుడు.

"మనం పది సెకండ్లు ముందుగా దిగి రావల్సింది. 'అలా జరిగుంటే మనకు ఆ టాక్సీ దొరికి ఉండేది. ఏమంటారు?" అని వెంటనే నాలుక కరచుకుని "మళ్లీ ఒకసారి ప్రయత్నిస్తాను" అన్నాను.

"అదదీ సంగతి" గట్టిగా అరిచాడు ఆ ముసలివాడు టోపీను లాక్కుంటూ. "భలేగా చెప్పావు. నా పాఠం నీ తలకెక్కింది" అన్నాడు ఆనందంగా.

మరొక టాక్సీ అటుగా వచ్చింది. నేను వేగంగా పరుగెత్తి తలుపు తెరిచి అతన్ని కారులో కూర్చోబెట్టాను. చిరునవ్వుతో నావైపు చేయి ఊపుతూ, కారులో అతను ముందుకు సాగిపోయాడు. ఆ తర్వాత ఆయనను నేను మళ్లీ చూడలేదు. హృద్రోగం వల్ల మరణించాడని నెలరోజుల తరువాత తెలిసింది.

ఇప్పటికి ఎన్నో ఏళ్లు గడిచిపోయాయి. అయినా కర్నూలు వెళ్లినప్పుల్లా సెప్టెంబరు మాసంలో జరిగిన ఆనాటి సంఘటన స్ఫురణకు వచ్చి నా కళ్లు చెమ్మగిల్లుతుంటాయి.

ఎప్పుడైనా సరే, నాలో నేను 'అలా జరిగుంటే' అని అనుకున్నప్పుడు, వెంటనే 'మళ్లీ ఒకసారి' అనే పదాలు చప్పున గుర్తుకు వచ్చి, కర్తవ్యాన్ని బోధిస్తాయి. అప్పుడు వెంటనే నా మనోనేత్రం ముందు ఆ వృద్ధుడు సాక్షాత్కరిస్తాడు. శక్తివంతమైన మాటలతో నా ప్రగతికి బాటలు వేసిన ఆ కర్మయోగికి మనసులోనే జోహార్లు అర్పిస్తుంటాను. ◆